**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో పర్యటించిన సందర్భంగా గుర్తించిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మరోసారి కమిషనర్‌తో చర్చించారు. అయ్యప్ప కాలనీలో డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఆటోనగర్ డంపింగ్ యార్డ్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి, ఫుట్‌పాత్‌లు నిర్మించాలని, సీసీ కెమెరాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్‌లో నూతన రహదారుల నిర్మాణం చేపట్టాలని, హరిహరపురం కాలనీ, విజయపురి కాలనీల్లో నూతన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే చంపాపేట్ డివిజన్ పరిధిలోని పవన్‌పురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

దీనిపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో స్పందిస్తూ, ఆయా అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యేకు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**విశాల భారతి అడవిదేవులపల్లి:** మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అడవిదేవులపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు సుమారు 36 లక్షల 4176 విలువ గల చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమావత్ బాలునాయక్, మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దింటి రామ్మూర్తి, వీరబోయిన వెంకటేశ్వర్లు, దుండిగల నాగరాజు, మున్నా వెంకటేశ్వర్లు, సాయం సైదయ్య మరియు కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- జ్ఞాన సరస్వతిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



**చౌటుప్పల్,విశాల భారతి:** భవాని నగర్ లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పూల నక్షత్రం సందర్భంగా అమ్మవారు జ్ఞాన సరస్వతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు.

**అక్షరాభ్యాసం,లలితా పారాయణంతో సందడి**

మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ పాత్రికేయులు సామిడి రాఘవరెడ్డి అరుణ దంపతుల మనుమరాలి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా భావన ఋషి కళానికేతన్ మరియు మాతృమండలి సభ్యులు సంయుక్తంగా శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం మరియు భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గాదేవి పూజా కార్యక్రమాన్ని చింతల తిరుమలరెడ్డి కరుణ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, వర్కాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గుగులోతు అరుణ శంకర్ నాయక్, దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,భజన మండలి సభ్యులు బడుగు బాలరాజు, పోలోజు రాజు చారి, గోశిక బాలకృష్ణ, పోలోజు వెంకటాచారి, సీత తిరుమలేష్, బడుగు సావిత్రమ్మ, తడక సురేఖ, కోణం వినోద, సూరపల్లి లలిత, కొసనం రామిరెడ్డి అనురాధ దంపతులు, ఉప్పల దీపిక, నిమ్మల అండాలు, మామిడి వెంకటమ్మ, బొబ్బిళ్ళ సామ్రాట్, మార సంగమేశ్వర్, కందగట్ల ఆనంద్ తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనులకు జైలు శిక్ష

- నాంపల్లి కోర్టులో 42 కేసుల పరిష్కారం



**సికింద్రాబాద్, విశాలభారతి :** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై నాంపల్లి కోర్టు కఠిన చర్యలు చేపట్టింది. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉన్న 8వ జేఎంఎఫ్‌సీ (డీడీ) న్యాయస్థానంలో జరిగిన విచారణలో మొత్తం 42 ట్రాఫిక్ కేసులు పరిష్కారమయ్యాయి. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి నిందితులను కోర్టు ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి విచారణ జరిపారు. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన నలుగురికి శిక్ష ఖరారు చేస్తూ, ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. జగన్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.

## అమ్మవారి మండపాలను దర్శించుకున్న కళ్లెం నవజీవన్ రెడ్డి

- హైకోర్టు కాలనీ, భూలక్ష్మీనగర్‌లో ప్రత్యేక పూజలు
- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హైకోర్టు కాలనీ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, భూలక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పిస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మర్రి మధుసూదన్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి తనయుడు కళ్లెం వార్షిక్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవిందాచారి, శ్రీధర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇట్టబోయిన నర్సింహ, నాయకులు లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, అరుణ్, బీజేవైఎం నాయకులు రీతిక్, ప్రణవ్, రోహన్‌తో పాటు స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలి!

- యువతకు పరిశ్రమలు.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- సబ్సిడీ రుణాలు, శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** ప్రభుత్వ పథకాలను, సబ్సిడీ రుణాలను, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని యువత, ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా, ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న, పెద్ద తరహా పరిశ్రమలను స్థాపించి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పెట్టుబడుల ప్రోత్సాహం, తెలంగాణ ఐపాస్ చట్టం, ఎంఎస్ఎంఈ పాలసీ, పీఎంఐఎస్ పథకం అమలు తదితర అంశాలపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆయా పథకాల అమలు, ఉపాధి అవకాశాల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వాహనాల కొనుగోలుకు అందించే సబ్సిడీ రుణాలతో పాటు పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ ఐపాస్, ఎంఎస్ఎంఈ, పీఎంఐఎస్ తదితర పథకాల ద్వారా అందించే అవకాశాలను అర్హులు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల సమాచారం చేరవేయడంతో పాటు శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, డీఆర్వో నాగలక్ష్మి, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఉపాధి కల్పన అధికారిణి రజిత, ఎల్‌డీఎం కె. యాదగిరి, సంక్షేమ అధికారిణి శిరీష, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, దేశీ రామ్ నాయక్, ఆర్టీఓ, విద్యుత్ శాఖ డీఈ హీరాలాల్, విద్యాశాఖ నుంచి అప్పారావు

## నిత్యావసర ధరల మంట.. విద్యుత్ ఛార్జీల వాత!



- సామాన్యుడి నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు
- ధరల నియంత్రణలో నిర్లక్ష్యం వీడాలి..
- ట్రూ అప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి ఆగ్రహం

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** ఒకవైపు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు.. మరోవైపు విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం.. ఇంకోవైపు పండుగల పేరుతో పెరుగుతున్న ఆర్టీసీ చార్జీలు.. ఇలా అన్ని వైపుల నుంచి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ వారి బతుకులను భారంగా మార్చడం ఎంతవరకు సమంజసమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే నియంత్రించాలని, ప్రజలపై అదనపు భారం మోపుతున్న విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేవలం రెండు నెలల వ్యవధిలోనే నిత్యావసర వస్తువుల ధరలు సుమారు 13 శాతం పెరగడం ఆందోళనకరమని అన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ధరల పెరుగుదలను అరికట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల పట్ల బాధ్యతారాహిత్యమేనని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహించడం వాటి అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. పండుగల సమయంలో ప్రజలకు ఊరట కల్పించాల్సింది పోయి, పండుగ స్పెషల్ పేరుతో ఆర్టీసీ చార్జీలను విపరీతంగా పెంచడం ఏమిటని ప్రశ్నించారు. పండుగలు సామాన్యులకు ఆనందాన్ని పంచాల్సిన సందర్భాలని, అలాంటి సమయంలో ప్రయాణ చార్జీలను పెంచి ప్రజల జేబులకు చిల్లులు పెట్టడం అన్యాయమని అన్నారు. ఇప్పటికే కుటుంబ ఖర్చులను భరించలేక సతమతమవుతున్న ప్రజలపై అదనపు భారాలు మోపడం ప్రభుత్వాలకు తగదని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటూ, ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్లలో కృత్రిమ కొరత సృష్టించి ధరలను పెంచేందుకు ప్రయత్నించే బ్లాక్‌మార్కెట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, నిత్యావసర వస్తువుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ధరలు అదుపులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ధరల నియంత్రణపై ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్పందించకపోతే సామాన్యుల జీవనం మరింత దుర్భరంగా మారుతుందని హెచ్చరించారు.

**విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం ఉపసంహరించుకోవాలి.**

విద్యుత్ కొనుగోలు వ్యయాలు, ఆదాయ లోటు పేరుతో సామాన్య ప్రజలపై సుమారు రూ.5,420 కోట్ల అదనపు భారాన్ని మోపడం అన్యాయమని నల్లు సుధాకర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసల చొప్పున అదనపు ఛార్జీలు వసూలు చేయాలనే నిర్ణయం ప్రజలపై మోయలేని భారం మోపడమేనని అన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో అల్లాడుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో మరో భారం వేయడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వాలు, వివిధ కారణాలను చూపుతూ ప్రజల నుంచే అదనపు వసూళ్లకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇదే విధంగా ముందుకు సాగితే సీపీఐ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కన్వీనర్ బుడమ వెంకన్న, మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నిలిగొండ నాగేశ్వరరావు, కాట్యాల

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- హాజరై బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం పెద్దమడుర్ గ్రామంలో 7వ రోజున సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆ గ్రామ ఆనవాయితీ వస్తుంది. ఈ సందర్భంగా గ్రామంలో జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని బతుకమ్మ వేడుకల్లో కోలాటం కూడా ఆడారు. పండుగ ఉత్సాహాన్ని నింపుతూ వారితో మమేకమై బతుకమ్మ ఆడటంతో అందరిలోనూ ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా గ్రామ ఆడ బిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు! తెలిపారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి మాజీ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం ఈ బతుకమ్మ పండుగ అన్నారు. ప్రకృతిలో లో లభించే తీరొక్క పూలను సేకరించి వాటిని అందంగా వలయా కృతిలో పేర్చి అమ్మవారు ఆ పార్వతీదేవికి ప్రతిరూపమైన గౌరమ్మను ప్రతిష్టించి కొలిచే అద్భుతమైన పండుగ ఈ బతుకమ్మ అన్నారు. ప్రపంచంలోనే ఆడ బిడ్డలు పువ్వులను పూజించే సంస్కృతి మన రాష్ట్రంలోనే వుంది. తెలంగాణ ఆడ బిడ్డల ఆత్మ గౌరవం ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి గా నిలిచింది బతుకమ్మ పండుగ. అందుకే సీఎం రేవంత్ రెడ్డి గారు బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా నిర్ణయించి నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, గ్రామ ఆడబిడ్డలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- హాజరై బతుకమ్మ ఆడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**దేవరుప్పుల విశాలభారతి :** మండలం పెద్దమడుర్ గ్రామంలో 7వ రోజున సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆ గ్రామ ఆనవాయితీ వస్తుంది. ఈ సందర్భంగా గ్రామంలో జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో కోలాటం కూడా ఆడారు. మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని నింపుతూ వారితో మమేకమై మాజీ మంత్రి ఎర్రబెల్లి బతుకమ్మ ఆడటంతో అందరిలోనూ ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా గ్రామ ఆడ బిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు! తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం ఈ బతుకమ్మ పండుగ అన్నారు. ప్రకృతిలో లో లభించే తీరొక్క పూలను సేకరించి వాటిని అందంగా వలయా కృతిలో పేర్చి అమ్మవారు ఆ పార్వతీదేవికి ప్రతిరూపమైన గౌరమ్మను ప్రతిష్టించి కొలిచే అద్భుతమైన పండుగ ఈ బతుకమ్మ అన్నారు. ప్రపంచంలోనే ఆడ బిడ్డలు పువ్వులను పూజించే సంస్కృతి మన రాష్ట్రంలోనే వుంది. తెలంగాణ ఆడ బిడ్డల ఆత్మ గౌరవం ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి గా నిలిచింది బతుకమ్మ పండుగ. అందుకే మాజీ సీఎం కెసీఆర్ గారు బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా నిర్ణయించి నిర్వహిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ గారు ఆడ బిడ్డలకు పండుగ కానుక గా బతుకమ్మ చీరలు ఇచ్చారు. కానీ ఈ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి హయంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరల ఇవ్వడంలో జప్యం చేస్తున్నారు. చెరువులలో కుంటలలో బతుకమ్మను సాగనంపేందుకు నీళ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ కు పాలన చేత కాక రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వస్తున్నాయి స్వయానా నేను ఇప్పుడు బతుకమ్మ ఎత్తుకొని వస్తున్న సమయంలోనే కరెంట్ పోవడం జరిగింది. ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, గ్రామ ఆడబిడ్డలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా" ఎగ్గొట్టేందుకే 'క్రాప్ హాలిడే' ప్రకటన

- ఇప్ప పృథ్వి రెడ్డి



**దేవరుప్పుల విశాలభారతి :** తెలంగాణ రైతులకు వ్యవసాయ పెట్టుబడి సహాయం కోసం ఉద్దేశించిన రైతు భరోసా (రైతు బందు) ఎగ్గొట్టాలని రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నాడని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయినప్పటినుండి మూడు దఫాలు రైతుబంధు చెల్లించలేదని అయన విమర్శించారు. యాసంగి సీజన్‌లో పంటలు వేయవద్దని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పడం వెనుక రైతులకు పెట్టుబడి సాయం అందించకుండా తప్పించుకోవాలనే ఉద్దేశం కనిపిస్తోందని పృథ్వి రెడ్డి అన్నారు. గతంలో సాగు చేసే భూములకే రైతు భరోసా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ, పంటలు వేయవద్దని చెప్పడం ద్వారా రైతులకు అందాల్సిన ఆర్థిక సాయాన్ని నిలిపివేసే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సమాన వర్షపాతం నమోదయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో క్రాప్ హాలిడే ప్రకటించలేదన్నారు. కృష్ణ, గోదావరి ఎగువ ప్రాంతాలనుండి వచ్చిన వరదను ఎత్తిపోయకుండా దిగువన ఆంధ్రప్రదేశ్ కు పంపించి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించాడని, ఆంధ్రాలో ప్రాజెక్టులు నిండు కుండలా ఉంటె, తెలంగాణను రేవంత్ రెడ్డి కరువు రాష్ట్రంగా మార్చాడని పృథ్వి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వచ్చిన ఈ కరువుకు రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని, తెలంగాణ రైతులందరికీ కాంగ్రెస్ హామీ ఇచ్చిన విదంగా ఎకరానికి రూ.15000 రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయి, పెట్టుబడులు కూడా తిరిగి రాని దుస్థితిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందువల్ల తెలంగాణలోని రైతులకు ప్రతి ఎకరానికి రూ.20,000 చొప్పున కరువు భత్యం అందించి తక్షణ ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.

## 331 దరఖాస్తులు.. ఒక్క బార్‌కు లక్కీ డ్రా!

- కేసముద్రం బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపు ప్రక్రియ పూర్తి
- ఎంపికైన కొలగాని ప్రమీల.. టోకెన్ నంబర్ 305కు అవకాశం



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ పూర్తయింది. ఒక్క బార్ కేటాయింపు కోసం మొత్తం 331 దరఖాస్తులు రావడంతో పోటీ నెలకొంది. శుక్రవారం మహబూబాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ పర్యవేక్షణలో లక్కీ డ్రా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 41 నూతన బార్ల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ కేటాయింపునకు అవకాశం కల్పించింది. ఇందుకోసం సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 331 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన దరఖాస్తులకు సంబంధించి నిర్వహించిన లక్కీ డ్రాలో కొలగాని ప్రమీల, భర్త రాములు, టోకెన్ నంబర్ 305 ద్వారా బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు ఎంపికయ్యారు. లక్కీ డ్రా ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- వద్దేపల్లి రాజేశ్వరరావు నివాసంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు



**కూకట్ పల్లి, విశాలభారతి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు నివాసంలో ఆయన కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తూ పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

# పూల పండుగకు పూలబాట!

- బతుకమ్మ సంబరాలతో కలెక్టరేట్ కళకళ!
- తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిన వేడుకలు
- మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు
- మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు ఎమ్మెల్యే దంపతుల నృత్యాలు
- ఉత్తమ బతుకమ్మల రూపకల్పన చేసిన శాఖలకు బహుమతులు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక.. ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు నిదర్శనం.. తర తరాలుగా వస్తున్న సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతిబింబం.. బతుకమ్మ పండుగ! అటువంటి పూల పండుగ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం లో అంగరంగ వైభవంగా జరిగింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళా ఉద్యోగుల సందడి, సంప్రదాయ పాటల హోరుతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. జిల్లా ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వ హించిన వేడుకల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొని మహిళా ఉద్యోగులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌ప ర్సన్ జ్యోతి గుగులోతు, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల విభాగం అధికారి, హౌసింగ్ పీడీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం.**

మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. మహిళలు బలోపేతమైతే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయ ని, కుటుంబాలు ప్రగతి సాధిస్తే సమాజం మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళల గౌరవం, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధా న్యమివ్వడం అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

**తెలంగాణ అస్తిత్వానికి బతుకమ్మ ప్రతీక.**

పూలను పేర్చి పూజించడం, ప్రకృతిని ఆరాధించ డం, సామూహికంగా పాటలు పాడుతూ ఆనందాన్ని పంచుకోవడం బతుకమ్మ పండుగ ప్రత్యేకతలని ఎమ్మె ల్యే అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మీయతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. మహిళలను గౌరవించే చోట సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, ఐకమత్యంతో పండు గలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, మహిళా ఉద్యో గులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**బతుకమ్మ పాటలకు ఎమ్మెల్యే దంపతుల అడుగులు.**

వేడుకల్లో మహిళా ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఆయన సతీమణి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ గీతాలు ఆలపిం చడంతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ కళను సంత రించుకుంది. మహిళా ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే దంపతులు ఉత్సాహంగా పాల్గొనడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు కలెక్ట రేట్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు.

**ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం.**

వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు సృజనా త్మకంగా రూపొందించిన బతుకమ్మలు వేడుకల్లో ప్ర త్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ బతుకమ్మలను రూ పొందించిన శాఖలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని రెవెన్యూ శాఖకు, రెండో బహు మతిని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు, మూడో బహుమతిని డీఆర్‌డీఓకు, నాలుగో బహుమతిని మెప్మాకు, ఐదో బహుమతిని టీజీవో, టీఎన్జీవో సంఘాలకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని వేడుక లను విజయవంతం చేశారు.

## మహబూబాబాద్ జిల్లాలో 67 ఉద్యోగాలు!

- ఎన్‌హెచ్‌ఎం పరిధిలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**మహబూబాబాద్ జిల్లా (విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** మహబూబాబాద్ జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగాల భర్తీకి అధికారులు శ్రీకారం చుట్టారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) 2026-27 సంవత్సరానికి సంబంధించి వివిధ కార్యక్రమాల్లో ఖాళీగా ఉన్న 67 కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పో స్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నియా మకాల్లో భాగంగా ఫ్రిజ్ మెకానిక్, ల్యాబ్ టెక్నీషియన్, పల్లె దవాఖానాల్లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ), మెడికల్ ఆఫీసర్ (ఎంఓ), ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఎంబీబీఎస్, ఎండీ ఫిజిషియన్లు, ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, స్టాఫ్ నర్స్, ఏఎన్‌ఎం, ఫార్మసిస్ట్, సీనియర్ డాట్స్ ప్లస్, టీబీ-హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, పీడియాట్రీషియన్, మెడికల్ ఆఫీసర్, జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు తమ దరఖాస్తులను అక్టోబర్ 29, 2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాల ప్రతులపై స్వయంగా సంతకం చేసి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, మహబూబాబాద్, ఎఫ్25, ఐడీఓసీ, మహబూబాబాద్ జిల్లా చిరునామాకు నేరుగా లేదా పోస్టు ద్వారా పంపించాలి. పోస్టు ద్వారా దరఖాస్తులు చేరడంలో జరిగే జాప్యానికి జిల్లా ఎంపిక కమిటీ బాధ్యత వహించదని స్పష్టం చేశారు. దరఖాస్తు రుసుముగా ఓసీ అభ్యర్థులు రూ.500, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300 చెల్లించాలి. ఈ మొత్తాన్ని "The District Medical and Health Officer: Mahabubabad" పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా అర్హ తలు, ఇతర నిబంధనలు, పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం మహబూబాబాద్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mahabubabad.telangana.gov.in ను సందర్శించి వివరాలను డౌన్‌లోడ్ చేసుకో వాలని డాక్టర్ రవి రాథోడ్ సూచించారు.

## మహబూబాబాద్ వైద్యకళాశాలలో ఉద్యోగాల భర్తీ

- ప్రొఫెసర్ పోస్టుకు రూ.1.90 లక్షల వేతనం.
- ఈ నెల 28న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు.




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో వివిధ బోధనా, వైద్య నిపుణుల పోస్టులను కాంట్రాక్ట్, గౌరవ వేతన ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులకు ఈ నెల 28న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రకటన ప్రకారం ప్రొఫెసర్ పోస్టులు 6, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 10, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 25, ట్యూటర్ పోస్టులు 22 భర్తీ చేయనున్నారు. అదేవిధంగా సీఏఎస్ స్పెషలిస్ట్ విభాగంలో అనస్థీషియా ఐసీయూకు ఒకటి, జనరల్ మెడిసిన్‌కు రెండు, పల్మనరీ మెడిసిన్‌కు రెండు, మరో స్పెషలి స్ట్ పోస్టు ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వేతనాల విషయానికొస్తే ప్రొఫెసర్ పోస్టుకు నెలకు రూ.1,90,000, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.25,000, ట్యూటర్‌కు రూ.55,000 చొప్పున నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీఏఎస్ స్పెషలిస్ట్ పోస్టులకు నెలకు రూ.1,00,000 వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు మహబూబాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వ హించనున్నారు. అభ్యర్థుల వయస్సు 2026 జూలై 1 నాటికి 69 సంవత్సరాలలోపు ఉండాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఇతర సంబంధిత ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తోపాటు జిరాక్స్ ప్రతులను వెంట తీ సుకురావాలని సూచించారు. పోస్టుల వారీగా విద్యార్హతలు, అర్హత ప్రమాణాలు, ఇతర పూర్తి వివరాల కోసం ప్రభుత్వ వైద్యకళాశాల అధికారిక వెబ్‌సైట్ http://gmcmahabubabad.org/ లోని నోటిఫికేషన్‌ను పరిశీలించాలని డాక్టర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు.

## వరి కోత యంత్రం ఢీకొని వ్యక్తి మృతి





**దేవరుప్పుల విశాలభారతి:** దేవరుప్పుల మండలంలోని వరి కోత యంత్రం ఢీకొని హనుమంతు 58 అనే వ్యక్తి మృతి చెందాడు, బాధితురాలి ఫిర్యాదు ప్రకారం హనుమంతు కూలి పనికి వెళ్తుండగా, సింగరాయ గండి బిసి వసతిగృహం సమీపంలో బావులవైపు వెళ్లే దారిలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వరికోతం యంత్రం ఢీ కొట్టింది, దీంతో ఆయన కింద పడగా యంత్రం టైరు మీదుగా వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వరి కోత యంత్రాన్ని అతివేగం గా అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మధు పై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమార్తె శీలా లక్ష్మి అలియాస్ ధనమ్మ దేవరకుల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది, ఈ మేరకు పోలీసులు తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంది.

## ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**తిరుమలగిరి,విశాల భారతి :** తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శుక్రవారం నాడు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించాలనే ఉద్దేశంతో సుమారు రెండు వందలకోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నారని అన్నారు అందులో భాగంగా తుం గతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల పరిధిలోని తొండ గ్రామంలో శివారులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మిస్తున్నామని చెప్పారు ఈ స్కూల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పారు స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులు కోరారు, ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకర జనార్ధన్ జిల్లా నాయకులు కేసిడి వెంకటరెడ్డి, జమ్మి లాల్ ,వై నరేష్, పిఎసిఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ ,మాజీ ఎంపీపీ జె శోభారాణి కౌన్సిలర్ తిరుమనీ యాదగిరి, బత్తుల శ్రీనివాస్, బోండ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.56 లక్షలతో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని



**దేవరుప్పుల విశాలభారతి:** మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో రూ.56 లక్షల వ్యయంతో చేపట్టనున్న మొదటి అంతస్తు మిగులు పనులను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా విద్యా సంస్థల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపి విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికా రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్,జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి,ఎస్ ఓ రజిత,జీసీడిఓ గౌసియా,ఏఎంఓ శ్రీని వాస్,ఎంఈఓ శ్రీనివాస్,మండల ఎస్సి,ఎస్టీ,బిసి,మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్, మహ్మద్ రసూల్ ,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,యువజన నాయకులు,విద్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బేతోలు ఆడపడుచుల భద్రత గాలికేనా?

- బతుకమ్మ ఆడేందుకు జాతీయ రహదారే దిక్కా?
- ఘాట్ ఏర్పాటు చేయాలి
- అధికార యంత్రాంగం స్పందించాలి!
- మాజీ వార్డు సభ్యుడు షేక్ ఖాదర్ బాబా డిమాండ్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** బతుకమ్మ తెలంగాణ ఆడపడు చుల ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన మహిళలు బేతోలు గ్రామంలో కనీస సౌకర్యాలు లేక ప్రమాదాల మధ్య వేడుకలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు అర్బన్ 6వ వార్డులో ప్రత్యేక బతుకమ్మ ఘాట్ లేక పోవడంపై మాజీ వార్డు సభ్యుడు షేక్ ఖాదర్ బాబా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

**జాతీయ రహదారిపై బతుకమ్మ.. పొంచి ఉన్న ప్రమాదం!**

బేతోలు గ్రామంలో వెయ్యి మందికి పైగా మహిళలు ఉన్నప్పటికీ, బతుకమ్మ ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం లేకపోవడం విచారకరమని ఖాదర్ బాబా పేర్కొన్నారు. చేసేదిలేక మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్లే జాతీయ రహదారి 365పైనే మహిళలు బతుకమ్మ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై వేడుకలు నిర్వహించడం ప్రమాదకరమని, ఏ క్షణంలో ఏ ప్రమాదం ముం చుకొస్తుందోనని మహిళలు ఆందోళన చెందుతు న్నారని తెలిపారు. సమీప పొలాల్లో విషపురుగుల సంచారం మరో సమస్యగా మారిందని, చిన్నారుల తో వచ్చే మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్లపైనే వేడుకలు.. కనీస సౌకర్యాలూ కరువు!**

ప్రత్యేక ఘాట్ లేకపోవడంతో కొందరు మహిళలు ఎస్సీ కాలనీ రోడ్లపై, మరికొందరు ఇళ్ల మధ్యలో బతు కమ్మ ఆడుకుంటున్నారని తెలిపారు. ఆలయాల వద్ద కూడా కనీస లైటింగ్ సదుపాయాలు లేక ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు లేకపోవడంతో బతుక మ్మలను పొలాల గట్ల వద్దే వదిలేసి రావాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. పండుగ వేళ మహి ళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని ప్రశ్నించారు.

**వినతులు ఎన్నిసార్లు ఇచ్చినా ఫలితం శూన్యమేనా?**

బేతోలు గ్రామంలో బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలని, మైసమ్మ కుంట వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు వినతిపత్రాలు అందించినా స్పందన లేదని షేక్ ఖాదర్ బాబా ఆరోపించారు. మహిళలు ఎదు ర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసు కెళ్లినా పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదాల మధ్య పండుగలు జరుపుకోవాల్సిన పరిస్థితి కొనసాగడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**తక్షణమే స్థలం కేటాయించాలి.. నిధులు మంజూరు చేయాలి!**

ఇప్పటికైనా జిల్లా అధికారులు, మున్సిపల్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి బేతోలులో బతుకమ్మ ఘాట్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని షేక్ ఖాదర్ బాబా డిమాండ్ చేశారు. ఘాట్ నిర్మాణానికి స్థలం కేటాయించి, అవసరమైన నిధులు మంజూరు చేయడంతోపాటు మైసమ్మ కుంట వద్ద లైటింగ్, భద్రత, నిమజ్జనానికి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. గ్రామ మహిళలు భయాందోళనలు లేకుండా బతుకమ్మ సంబరాలు జరుపుకునేలా అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బేతోలు ఆడపడుచులకు భద్రత కల్పించడం ఇకనైనా అధికార యంత్రాంగం బాధ్యతగా తీసుకోవాలి. హామీలతో కాలయాపన చేయకుండా, క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించి బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలని షేక్ ఖాదర్ బాబా స్పష్టం చేశారు.

## ఉద్యమకారుల హామీల అమలుకు సీఎం రేవంత్ ముందడుగు



- పి. వెంకట్ రాంరెడ్డి
- ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక వెబ్‌సైట్.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించిన షాద్‌నగర్ ఉద్యమకారులు

**విశాల భారతి, షాద్‌నగర్:** తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్ రాంరెడ్డి అన్నారు.తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందు బాటులోకి తీసుకురావడంపై ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో బ్లాక్ ఆఫీస్ ఆవరణలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సహా ప్ర భుత్వం ఇచ్చిన మిగతా హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యమకారుల త్యా గాలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ సాధనకు సంబంధించిన ఘనత ఒకే కుటుంబానికి ఆపాదించినట్లుగా వ్యవ హరించారని విమర్శిస్తూ,రాష్ట్ర సాధనలో పేదలు, అట్టడుగు వర్గాలు, బడుగు బలహీన వర్గాల ప్రజల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉద్యమంలో పాల్గొ న్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా వివరాల నమోదు, గుర్తింపు ప్రక్రియ చేపట్ట డం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం తీసుకు న్న సీఎం రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకుడు టీజీ శ్రీనివాస్, ఉద్యమకారుల సంఘం తాలూకా కోకన్వీనర్ జాంగారి రవి, మండల అధ్య క్షుడు దొడ్డి రవీందర్, పద్మారం వెంకటేష్ యాదవ్‌తో పాటు నాయకులు తదితరులున్నారు..

## శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

- బుద్వేల్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించు కునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ మహాలక్ష్మీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అమ్మ వారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ప్రార్థించారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు కోరుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నారు. అమ్మవారి దర్శనం, పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

## పసుమాములలో ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు
- అన్నప్రసాద దాతలుగా గౌని శ్యామల భాస్కర్ గౌడ్ దంపతులు



**విశాల భారతి, అబ్దుల్లా పూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామంలో అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దు ర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తుండగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మ వారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప ఫౌండేషన్ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల చైర్మన్ చెట్టి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా మాజీ కౌ న్సిలర్ గౌని శ్యామల భాస్కర్ గౌడ్ దంపతులు అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి మండపం వద్ద కళాకారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గౌని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భా గస్వాములవుతూ భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయ ని తెలిపారు. అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సేవ దాత భక్తి బాబు గౌడ్, యాదాద్రి భువనగిరి పాలకమండలి సభ్యులు ఈశ్వరమ్మ యాదవ్, దండెం రామ్ రెడ్డి, మున్సి పల్ మాజీ చైర్మన్ ఈదమ్మల బలరాం, చినపాక పద్మ శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్, అయ్యప్ప ఫౌండేషన్ దేవి నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ మహాశక్తి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న సామ రంగారెడ్డి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- మాజీ రాజ్యసభ సభ్యులు గరికిపాటి మోహన్‌రావుతో
- కలిసి పాల్గొన్న ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో నిర్వహిం చిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రభారీ సామ రంగారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో మాజీ రా జ్యసభ సభ్యులు గరికిపాటి మోహన్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించా రు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి నూతి శ్రీనివాస్ రావు, జిల్లా అధికార ప్రతినిధి తడక మళ్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో రైతాంగం.. ప్రభుత్వంపై సమరశంఖం!

- రైతులపై కరువు పంజా.. విద్యుత్ చార్జీలతో మరో దెబ్బ!
- ఎండుతున్న పంటలు.. మండుతున్న రైతాంగం
- కరువు సహాయక చర్యలు చేపట్టాల్సిందే
- రైతులను ఆదుకోవాల్సిందే!
- విద్యుత్ కోతలు ఎత్తివేయాలి
- రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య





**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** రాష్ట్రంలో కరువు కోరలు చాస్తున్నా.. పంటలు ఎండిపోతున్నా.. రైతాంగం పెట్టుబడులు కోల్పోతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (AIKMS) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం నిలదీసింది. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాలయాపన చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకవైపు వర్షాభావం.. మరోవైపు విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలు.. ఇంకోవైపు ట్రూ అప్ చార్జీల పెంపు.. ఇలా రైతాంగంపై వరుస దెబ్బలు పడుతున్నాయని మండిపడింది. తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 22, 23 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.

**లోటు వర్షపాతం.. ఎండుతున్న పంటలు**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని AIKMS పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో బావులు, బోరుబావులు, ఇతర నీటి వనరులు అడుగంటిపోతున్నాయని తెలిపింది. నీటి లభ్యత తగ్గడంతో ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయని, పెట్టుబడులు తిరిగొస్తాయన్న ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. కొందరు రైతులు పంటలను పశువుల మేతకు వదిలేస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొంది. కరువు తీవ్రత పెరుగుతున్నా ప్రభుత్వం నుంచి సమగ్రమైన సహాయక కార్యాచరణ కనిపించడం లేదని విమర్శించింది.

**విద్యుత్ కోతలతో రైతులకు కష్టాల మీద కష్టాలు.**

పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతుంటే విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కొద్దిపాటి నీటి వనరులు అందుబాటులో ఉన్నా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలకు తడులు అందడం లేదని పేర్కొంది. లోఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతుండటంతో రైతులు అదనపు ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపింది. వ్యవసాయానికి అత్యవసరమైన సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కోతలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.

**కరువు వేళ చార్జీల పెంపా?**

రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాన్ని పెంచడంపై AIKMS తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రూ.7,635 కోట్ల మేర వసూళ్లకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొంటూ, యూనిట్‌కు 50 పైసల వరకు అదనపు భారం పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. పంటలు ఎండిపోయి ఆదాయం కోల్పోతున్న రైతులకు ఉపశమనం కల్పించాల్సింది పోయి, అదనపు భారాలు మోపడం అన్యాయమని విమర్శించింది. ట్రూ అప్ చార్జీల వసూళ్లకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల పెంపును భేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

**క్రాప్ హాలిడేతో రైతులు, కూలీల బతుకులు ప్రశ్నార్థకం.**

రబీ సీజన్‌లో పంటలు వేయకుండా క్రాప్ హాలిడే పాటించాలనే సూచనలపై AIKMS ప్రశ్నలు లేవనెత్తింది. పంటలు వేయవద్దని చెప్పడం సులభమే కానీ, సాగు నిలిచిపోతే రైతుల పరిస్థితి ఏమిటని, వ్యవసాయ పనులపైనే ఆధారపడే కూలీల కుటుంబాలు ఎలా జీవించాలని నిలదీసింది. ఇప్పటికే పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, సాగు నిలిచిపోతే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సంక్షోభం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించింది. కరువు సమస్యపై రైతు, వ్యవసాయ కూలీ సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని కోరింది.

**ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి.**

కరువు కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలని AIKMS డిమాండ్ చేసింది. సాగు చేయని రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున, పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని కోరింది. రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక ఆర్థిక, ఉపాధి ప్యాకేజీ ప్రకటించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రకటించిన నెలకు రూ.1,000 ఆర్థిక సాయాన్ని బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది.

**ఉపాధి పనులు ప్రారంభించాలి.. తాగునీటి కొరత నివారించాలి.**

కరువు పరిస్థితులతో ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించాలని సంఘం కోరింది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పశువులకు పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని సూచించింది. ఎల్‌నినో ప్రభావంతో అనారోగ్యానికి గురైన వారికి ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేసింది. కరువు ప్రాంతాలను వెంటనే ప్రకటించి, బాధిత రైతులు, కూలీలకు అండగా నిలిచేలా ప్రత్యేక సహాయక ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేసింది.

**22, 23 తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు.**

కరువు సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 22, 23 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని AIKMS తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. కరువు సహాయక చర్యలు చేపట్టడం, రైతులకు నష్టపరిహారం అందించడం, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడం, విద్యుత్ కోతలను నివారించడం, ట్రూ అప్ చార్జీల పెంపును రద్దు చేయడం వంటి డిమాండ్ల సాధన కోసం రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో పాల్గొనాలని కోరింది. ఈ మేరకు AIKMS రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య ప్రకటన విడుదల చేశారు.

## రౌడీ షీటర్లు, అనుమానితులపై పోలీసుల నిఘా!

- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- కేశంపేట సీఐ శ్రీనివాస్




**విశాల భారతి, షాద్‌నగర్:** శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.ఆయా వ్యక్తుల ప్రస్తుత మొబైల్ నంబర్లు,నివాస చిరునామాలు, కార్యకలాపాలపై ఆరా తీసి వివరాలను ధ్రువీకరించారు. సంబంధిత వ్యక్తులను పిలిపించి,ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేశంపేట సీఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా అనుమానిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

## దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

- దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన ఆలయ చైర్మన్ రాంచందర్, ఈఓ స్నేహలత



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ కనక దుర్గా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు సమర్పించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఆలయ చైర్మన్ రాంచందర్, కార్యనిర్వహణాధికారి స్నేహలత ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజా కార్యక్రమాలను నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మహేష్ యాదవ్, మధుసాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో ప్రభావం, నీటి కొరతపై ప్రత్యేక సమావేశం

- పిగ్లిపూర్‌లో గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, జలసిరి పనులపై చర్చ



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిగ్లిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం (అక్టోబర్ 16) ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎల్నినో ప్రభావం, నీటి కొరత నివారణ చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం, జలసిరి పనులు, వీబీ జీ రామ్ జీ పథకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ మార్పులు, నీటి ఎద్దడి వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. గ్రామంలో నీటి కొరత తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. జలసిరి పనుల పురోగతిని సమీక్షిస్తూ, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే వీబీ జీ రామ్ జీ పథకం అమలు, ఉపాధి హామీ పనుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధితో పాటు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సమావేశంలో అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ దుర్గం నరసింహ యాదవ్, వార్డు సభ్యులు జక్కుల శివకుమార్, జక్కుల ఝాన్సీ-ఆంజనేయులు, వర్ధం లావణ్య-హనుమంతు, జక్కుల పరమేశ్ యాదవ్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్ యాదవ్, కోలన్ హరిణి-మహేందర్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన వివిధ శాఖల ప్రతినిధులు, వీఓ, అంగన్‌వాడీ కార్యకర్తలు (ఏడబ్ల్యూటీ), రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

- ప్రణాళికలు సిద్ధం చేయాలి
- తాగునీరు, వ్యవసాయం, పశుగ్రాసం
- విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్



**విశాలభారతి ఇబ్రహీంపట్నం:** ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎల్‌నినో ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశించారు.శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, ఉద్యానవన శాఖ, తాగునీటి సరఫరా, విద్యుత్, నీటిపారుదల తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, టీజీపీసీడీఎల్ చైర్మన్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ, తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని, వ్యవసాయంతో పాటు ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని పేర్కొన్నారు.వేసవిలో పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నీటి సరఫరా వ్యవస్థలు సజావుగా పనిచేసేలా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జిల్లాలకు సంబంధించిన సమస్యలు, అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు సకాలంలో అందించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మేడ్చల్ అదనపు కలెక్టర్లు ఫైజల్ అహ్మద్, వికారాబాద్ అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ అఖిలకు ఘనంగా శ్రీమంతం

- పోలీస్ శాఖలో మానవీయ విలువలు
- ఆదిభట్ల ఇన్స్పెక్టర్ ఎస్ రమేష్




**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ, పోలీస్ స్టేషన్ పనితీరులో తనదైన సేవలతో విశేష కృషి చేసిన మహిళా కానిస్టేబుల్ అఖిలకు ఆదిబట్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ శ్రీమంతం నిర్వహించి, మానవీయతను చాటుకున్నారు. తొమ్మిది నెలల గర్భవతిగా ఉన్న మహిళా కానిస్టేబుల్ అఖిలకు సంప్రదాయబద్ధంగా చీర, సారె అందజేసి, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో నిరంతరం సేవలందించిన మహిళా సిబ్బంది పట్ల కుటుంబ సభ్యుల తరహాలో ఆప్యాయతను చూపిస్తూ, పోలీస్ శాఖలో మానవీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ మాట్లాడుతూ, ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది విధి నిర్వహణ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా మహిళా సిబ్బంది ప్రతి విభాగంలోనూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, బందోబస్తు విధులతో పాటు పోలీస్ స్టేషన్ రోజువారీ కార్యకలాపాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తించి, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.మహిళా సిబ్బంది తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తూ పోలీస్ స్టేషన్ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొని మహిళా కానిస్టేబుల్ అఖిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తిస్తూ, వారి సంతోషంలో భాగస్వాములవడం ద్వారా పోలీస్ శాఖలో ఆప్యాయత, ఆత్మీయత, సహోదరభావాలకు ఆదిబట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రాధాన్యతనిచ్చారు.

## గ్రామ అభివృద్దే మా ప్రధాన లక్ష్యం

- గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ
- గ్రామ నిరంతర సేవలో గ్రామపంచాయతీ సిబ్బంది
- గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్




**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** గ్రామంలో రోడ్లు అండర్ డ్రైనేజీలు పరిసరాల పరిశుభ్రత పరిశుభ్రంగా ఉన్నాయంటే గ్రామపంచాయతీ సిబ్బంది ముందుంటున్నారని గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ అన్నారు. యాచారం మండలం పరిధిలోని అయ్యవారి గూడ గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా శుక్రవారం దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సేవలో నిరంతరం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని అభినందిస్తూ ప్రోత్సహిస్తూ, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్, వార్డు మెంబర్స్ బాణావత విజయ రాజు నాయక్, కొప్పు మహేష్, మండలి మంజుల గోపాల్, మహేష్ వలవోజు, నక్క కలమ్మ, నేనావత్ అంజలి పాండు, సభావత్ గోపాల్, అంగన్వాడీ టీచర్ ,ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి దుర్గా మత ఆశీస్సులు ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**విశాల భారతి,షాద్ నగర్:** దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు..శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది.అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ్ గౌడ్, నవీన్ చారి, వేణు చారి, మ్యాధారీ శ్రీనివాస్, హాసన్, గోవింద్, శేఖర్ గౌడ్, పెంటయ్య యాదవ్ తదితరులున్నారు..

## పసుమాములలో ఘనంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



- అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు.. అన్నప్రసాద దాతలుగా గౌని శ్యామల భాస్కర్ గౌడ్ దంపతులు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామంలో అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తుండగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప ఫౌండేషన్ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల చైర్మన్ చెట్టి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా మాజీ కౌన్సిలర్ గౌని శ్యామల భాస్కర్ గౌడ్ దంపతులు అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి మండపం వద్ద కళాకారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గౌని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సేవ దాత భక్తి బాబు గౌడ్, అయ్యప్ప ఫౌండేషన్ దేవి నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శారదా నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న కళ్లెం నవజీవన్ రెడ్డి

- దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హైకోర్టు కాలనీ డివిజన్ పరిధిలోని శారదా నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు సమర్పించి, ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జగన్మాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు మర్రి మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవింద చారి, బీజేవైఎం నాయకులు చైతన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కోర్టులో ఏఐఎల్‌యూ కమిటీ ఏర్పాటు

- 22 మందితో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.. అధ్యక్షురాలిగా టి. సంధ్య, ప్రధాన కార్యదర్శిగా కె. రామచందర్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జిల్లా కోర్టు కమిటీని అక్టోబర్ 15న ఏర్పాటు చేశారు. టి. సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్బగాని వెంకటేశ్వర్లు, ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల ఐక్యతను బలోపేతం చేయడం, వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం, హక్కుల పరిరక్షణకు పాటుపడటంపై చర్చించారు. అనంతరం 22 మంది సభ్యులతో కూడిన జిల్లా కోర్టు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా టి. సంధ్య, ప్రధాన కార్యదర్శిగా కె. రామచందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చౌడా కుమారి, బాపు భీమ్‌రావు, కొమరయ్య, సంయుక్త కార్యదర్శులుగా బి. శ్రీదేవి, ఎ. రాజిత, కందుకూరి నరసింహ చారి, కోశాధికారిగా ప్రవీణ్ ఎంపికయ్యారు.న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సమావేశంలో చర్చించారు. న్యాయవాదుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, వారి సంక్షేమం కోసం సమిష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

## బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా గర్గుల మోహన్ రెడ్డి



**విశాలభారతి, కుత్బుల్లాపూర్:** భారతీయ జనతా పార్టీ మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా గర్గుల మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ సమక్షంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గర్గుల మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల సమస్యల పరిష్కారానికి, రైతు సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు.

## వారా సిగూడ పిఎస్ పరిధిలో ఆపరేషన్ కవచ్



**సికింద్రాబాద్, విశాల భారతి :** వారా సిగూడ పోలీసుల ఆధ్వర్యంలో ఆపరేషన్ కవచ్, తనిఖీలు నిర్వహించారు. పార్సిగుట్టలోని గోవా పాన్ షాప్ వద్ద పోలీసుల వాహనా ల తనిఖీలు చేసి ఐదు వాహనాలు సీజ్ చేశారు. చిలకలుగూడ ఏసిపి శశాంత్ రెడ్డి ఆదేశాలతో, వరసిగూడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు వాహనాలను పరిశీలించారు.ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 5 ద్వి చక్ర వాహనాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు బుక్ చేసినట్లు సిఐ తెలిపారు .

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**విశాల భారతి,షాద్ నగర్:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేశంపేట సీఐ శ్రీనివాస్, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన పోలీసింగ్ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా షాద్‌నగర్ పట్టణంలో తీవ్రతరమవుతున్న ట్రాఫిక్ సమస్యకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణను పటిష్ఠం చేసి ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికే క్రికెట్

- **ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**



**విశాల భారతి,షాద్ నగర్ :** కొందుర్గు మండల కేంద్రంలో జైభీమ్ క్రికెట్ టోర్నమెంట్ సీసన్ 6 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి పరస్పర సోదరభావానికి తోడ్పడతాయని,క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో కొందుర్గ్ మాజి జడ్పీటీసీ రామకృష్ణ, మహదేవ్ పూర్ సర్పంచి అనుష రవిందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర యువనాయకులు సుందర్ తదితరులున్నారు.

## బతుకమ్మ ఉత్సవాల్లో మోతకాని మంజులకి ప్రథమ బహుమతి

- **25 వేల రూపాయలు అందుకున్న మోతకాని మంజుల**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ ఉత్సవాలలో పోటీలు నిర్వహించగా ఈ పోటీలో బతుకమ్మను తీరొక్క పువ్వులతో పేర్చి తెలంగాణ పల్లెటూరు సాంప్రదాయానికి చక్కటి రూపు తో బతుకమ్మను తయారుచేసిన యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన మోతకాని మంజూల ప్రథమ బహుమతి రాలుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మోతకాని మంజుల మాట్లాడుతూ మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని నీ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్క ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ బతుకమ్మ ప్రథమ బహుమతిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు, నల్లగొండ గద్దర్ నరసన్న చేతుల మీదుగా ఈ బహుమతిని అందుకోవడం చాలా గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు

- **కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం.. భక్తులకు అన్నప్రసాద వితరణ**





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్‌లోని శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు సమర్పించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సేవాభావానికి ప్రతీకలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం నవజీవన్ రెడ్డి తల్లి కళ్లెం కళావతి, సతీమణి కళ్లెం నవీన, తనయులు వార్షిక్ రెడ్డి, శుశాంత్ రెడ్డి, బీజేపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బూర్గుల గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
- **రూ.15 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం**
- **అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు**
- **బూర్గుల గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు**
- **త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తాం**



**విశాల భారతి, షాద్ నగర్:** ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో నేడు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు,స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.బూర్గుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో 31 ఇళ్లు,రెండో విడతలో 14 ఇళ్లు మంజూరు చేశామని, మొత్తం 45 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించామని పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా బూర్గుల గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే బూర్గుల గ్రామ ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అతి త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడటంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు పంట నష్టం జరగకుండా ఉండేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ప్రతిరోజూ అదనంగా మూడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. అదనపు విద్యుత్ సరఫరాతో రైతులకు సాగునీటి అవసరాలు తీరి, పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, విద్య, రవాణా, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాజ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కొత్తూరు టౌన్ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సర్పంచులు యాదగిరి, రాజగోపాల్ రెడ్డి, వడ్ల జంగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగారి రవి, తాలూకా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ తదితరులున్నారు..

## నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష

- **పెండింగ్ పనులను వేగవంతం చేయాలి**
- **ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**



**విశాల భారతి, షాద్ నగర్:** నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని,వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం దృష్టి సారిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ ఆర్డీఓ సరిత,ఎమ్మార్వో నాగయ్య,నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ముషీరాబాద్,విశాల భారతి:** విద్యుత్ స్తంభాల ఏర్పాటు లైన్ మెయింటెనెన్స్ లో భాగంగా నేడు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏ డి ఈ, సిబి డి, సీ 2 జి నాగేశ్వరావు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుండి 11:30 గంటల వరకు సంజీవయ్య నగర్ తిలక్ నగర్ మీసేవ శివాలయం పరిసర ప్రాంతాలు, ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పద్మ కాలనీ, పిబిఆర్ ఎస్టేట్, వెజిటేబుల్ మార్కెట్ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటిగంట వరకు రిశాల గడ్డ, అంబేద్కర్ నగర్, హరి నగర్, అచ్చయ్య నగర్ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు 44 నంబర్ బస్సు స్టాప్, గంగపుత్ర కాలనీ, ఫిష్ మార్కెట్, రామాలయం, ఫ్రెండ్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని నాగేశ్వరరావు కోరారు.

## మోసపోయినం.. ఘోష పడుతున్నం

- **ఆనాడు కేసిఆర్ చెప్పిందే నిజమైంది**
- **పంటలు ఎండిన రైతులు పండుగ ఎలా చేసుకోవాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచించాల్సిన తరుణం**
- **ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి**
- **షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**




**విశాల భారతి, షాద్ నగర్:** ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి.. సకాలంలో విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం వేడుక చూస్తుంది.. పంటలు ఎండిపోయి అవస్థలు పడుతున్న రైతులు పండగ ఎలా చేసుకోవాలి.. కనీస ప్రణాళిక లేకుండా ప్రభుత్వం ఎలా నడిపిస్తున్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా స్పందించాలి.. నష్టపోతున్న అన్నదాతలకు పరిహారం అందించాలి.. లేదంటే సర్కారుపై ఇక యుద్ధమే.. అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై .అంజయ్య యాదవ్ అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అన్నదాతలు మాత్రమే కాదు.. సామాన్యులు జీవించాలన్నా వ్యవసాయం బాగుండాలి. వ్యవసాయం బాగుండాలంటే నీరు, విద్యుత్ సమృద్ధిగా ఉండాలి. అందుకే గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, వ్యవసాయ సమయంలో అతివృష్టి,అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమీక్షల నిర్వహణ ద్వారా వ్యవసాయాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్ నినో ప్రభావం వల్ల పంటలు ఎండిపోతుంటే విద్యుత్ ఇవ్వకుండా రైతుల సహనాన్ని పరీక్షిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పంటలకు 25 రోజులు పూర్తిస్థాయిలో కరెంటు ఇచ్చినా వ్యవసాయం బాగుపడుతుందని, అలాంటి సహకారం ప్రభుత్వం నుంచి లేకపోవడం వల్ల మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయిందని,వరి చేలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్ మోసపోతే ఘోషపడతామని చెప్పారని, ప్రస్తుతం అదే జరుగుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే కరెంటు సమస్యలు, ఎరువుల కోసం కొట్టుకోవడం వంటిది జరిగాయని, ఇప్పుడు మళ్లీ అదే పునరావృతం అవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడంలో ఎప్పుడు కూడా రాజీ పడలేదని, కాంగ్రెస్ వచ్చాక ఆ తేడా స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఎల్ నీ నో కారణంగా సమస్య ఉత్పన్నం అవుతుందని ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నించారు. శ్రీశైలం, కాళేశ్వరం ద్వారా నీటిని నిలువ చేసుకొని రైతులకు అందించాల్సిన బాధ్యతను కూడా మర్చిపోయారని అన్నారు. సమీక్షల ద్వారా కనీసం అధికారులను అప్రమత్తం కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేసి అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. హైడ్రో పవర్ లేకపోతే థర్మల్ పవర్ ద్వారా ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా వరకు నష్టం జరిగిందని కానీ ఎక్కడ ఎంత నష్టం జరిగిందో ఈరోజుకు తెలుసుకోలేకపోయారని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి జరిగిన నష్టానికి రైతులకు ఎకరాకు 50 వేలు చొప్పున పరిహారం అందించాలని సూచించారు. కనీసం ఇంకో 20 రోజులైనా 24 గంటలు విద్యుత్ ఇచ్చి అన్నదాతలకు సహకరించాలన్నారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. నేతలు వి. నారాయణరెడ్డి, ఈట గణేష్, రాజా వరప్రసాద్, లక్ష్మణ్ నాయక్, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ యాదవ్, జూపల్లి శంకర్, రవి యాదవ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు..

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఆవరణలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు మహిళల ఆటపాటలు, ఉత్సాహభరిత వాతావరణం మధ్య వైభవంగా సాగాయి. కార్యక్రమంలో తొలుత విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సతీమణి శ్రీమతి అల్దాస్ భారతి, విశ్వవిద్యాలయ మహిళా అధికారులు కలిసి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు చేస్తూ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు పరిపాలన భవనం ఆవరణలో పండుగ వాతావరణాన్ని నింపాయి. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం ఆనందంగా ఉందని మహిళా ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ ముందస్తు సన్నాహక సమావేశం

- **ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి: తోకల శ్రీనివాస్ రెడ్డి**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్లకు చెందిన పార్టీ నాయకులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, పట్టభద్రుల ఓటర్ల నమోదు, అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల బాధ్యతలు తదితర అంశాలపై ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి డివిజన్‌లో ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలకు ముందుగానే అవసరమైన కార్యాచరణ రూపొందించుకుని, ప్రతి నాయకుడు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. డివిజన్ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సన్నద్ధతను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలో అర్హులెవరూ మిగిలిపోకుండా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పార్టీ నిర్దేశించిన కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పట్టభద్రులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్లకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొని రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాండు యాదవ్, అడికె జనార్ధన్, శ్రీకాంత్ రెడ్డి, వి. లక్ష్మీ, నవారు మురళీధర్ రెడ్డి, సి. రమణ, బి. నర్సింహ, కె. బాబు, నర్సిరెడ్డి, అంజమ్మ, రాజు, ఎ. శివ, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, రాజకుమార్, సురేష్ యాదవ్, రవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

- **పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు**



**అశ్వాపురం, విశాలభారతి :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలను సారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచులు, కార్యదర్శులు, ఐకెపి ఉద్యోగులు సంయుక్తంగా బతుకమ్మ వేడుకలను ఉత్సాహకర వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా తీరక పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా రెండు గంటల పాటు ఆడి పాడారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా నియమజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు.

**తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు : ఎంపీడీవో ముత్యాలరావు.**

తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు చేసిందన్నారు. క్రమంలోనే మండలంలోని మహిళా సర్పంచులు, కార్యదర్శులు, ఐకెపి ఉద్యోగులతో పాటు మండల పరిషత్ లో ఉన్న ప్రతి ఒక్కరు ఈ వేడుకలలో పాల్గొనడం విశేషం అన్నారు. అనంతరం ఆయన మండల ప్రజలకు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల సర్పంచులు, ఏపీ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లపై దళారుల దందా?

- మన్సూరాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాల ఆరోపణలు..
- ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూళ్లంటూ బాధితుల ఆవేదన
- 20 ఏళ్లుగా నివసిస్తున్న స్థానిక పేదలకు ఇళ్లు దక్కడం లేదని ఆవేదన
- ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల వారికి పట్టాలంటూ ఆరోపణలు
- హౌసింగ్ అధికారుల పాత్రపైనా అనుమానాలు..

సమగ్ర విచారణకు డిమాండ్

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**


Date: 22/12/2025
శ్రీయుత గౌరవనీయులైన R D O Kandukur
REVENUE DIVISIONAL OFFICER
22 DEC 2025
KANDUKUR DIVISION
RANGA REDDY DISTRICT
VICE PRESIDENT
DASARI GANGADHAR
Girijana Abhivruddi Seva Samsthe
Cell : 8143875050




నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాల్సిన ప్రభుత్వ పథకం.. కొందరి అక్రమ వసూళ్లకు వేదికగా మారుతోందా? అర్హులైన పేదలకు అందాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో దళారుల జోక్యం పెరిగిందా? ఇల్లు ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారా? ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ ఏరుకల నాంచారమ్మ నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులపై వెలువడుతున్న ఆరోపణలు ఈ ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలు తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తుండగా, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మన్సూరాబాద్‌లో సుమారు 1.34 ఎకరాల విస్తీర్ణంలో రెండు బ్లాకులుగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో బిబ్లాక్‌లోని 84 ఖాళీ ఫ్లాట్ల కేటాయింపుల చుట్టూ వివాదం నెలకొంది. ఇల్లు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడిగా చెప్పుకుంటున్న జె.సాగర్ గంగయ్య అనే వ్యక్తి మరో స్థానిక వ్యక్తితో కలిసి ఇళ్ల కేటాయింపుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది.

**లక్షల్లో వసూళ్లు..**
**డబ్బులు చెల్లిస్తేనే ఇల్లు వస్తుందా?**

ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించాల్సిన ఇళ్ల విషయంలో డబ్బుల వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఇల్లు ఇప్పిస్తామని నమ్మబలికి కొందరి నుంచి లక్షల రూపాయలు తీసుకున్నారని, ఇప్పటికే సగం డబ్బులు చెల్లించిన వారిని మిగిలిన మొత్తం కోసం ఒత్తిడికి గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు వస్తుందనే ఆశతో అప్పులు చేసి డబ్బులు చెల్లించామని, ఇప్పుడు మిగిలిన డబ్బుల కోసం వేధింపులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హతల ఆధారంగా ప్రభుత్వ ఇళ్లు కేటాయించాల్సి ఉండగా, డబ్బులు చెల్లించిన వారికే ఇళ్లు వస్తున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా? ఇళ్ల కేటాయింపుల్లో నిబంధనలు పాటించారా? ఖాళీగా ఉన్న 84 ఫ్లాట్లను ఎవరికి, ఏ ప్రాతిపదికన కేటాయించారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

***20 ఏళ్లుగా నివాసం..**
**స్థానిక పేదలకు అన్యాయమా?**

ఏరుకల నాంచారమ్మ నగర్‌లో సుమారు 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థానిక పేద కుటుంబాలకు ఇళ్లు దక్కలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన కొందరికి ఇళ్ల పట్టాలు లభించాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఏళ్ల తరబడి నివసిస్తూ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న తమను పక్కనపెట్టి, ఇతరులకు ఇళ్లు ఎలా కేటాయించారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల కేటాయింపులపై ప్రశ్నించినప్పుడు డబ్బులు చెల్లించని కారణంగానే ఇళ్లు రాలేదని దళారులు సమాధానం చెబుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అర్హతల ఆధారంగా కాకుండా డబ్బుల ప్రాతిపదికన కేటాయింపులు జరిగాయనే ఆరోపణలు నిజమైతే, అది పేదల హక్కులకు భంగం కలిగించినట్లే అవుతుంది. అయితే ఈ అంశంపై అధికారిక రికార్డుల పరిశీలన, విచారణ ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**ఇళ్ల కోసం మహిళ ఆత్మహత్యాయత్నం..**
**ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు**

ఇళ్ల కేటాయింపుల వివాదం బాధిత కుటుంబాలను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంతో మన స్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానికులు అడ్డుకున్నట్లు సమాచారం. పేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పథకం చుట్టూ ఇలాంటి వివాదాలు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు, ఇళ్ల పట్టాలు పొందిన కొందరు వాటిని రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదేవిధంగా కుంట్లూరులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ అమాయకుల నుంచి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారిక ధ్రువీకరణ లేనందున, సంబంధిత ఇళ్ల కేటాయింపులు, లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**హౌసింగ్ పీడీ పాత్రపై ఆరోపణలు..**
**విచారణపై ప్రశ్నలు***

ఈ వ్యవహారంలో హౌసింగ్ పీడీ చంప్లా నాయక్ పాత్రపైనా పలు అనుమానాలు ఉన్నాయని ఎరుకల సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల జోక్యం లేకుండానే ఇళ్ల కేటాయింపుల వ్యవహారంలో ఆయన వ్యవహరిస్తూ, సాగర్ గంగయ్యకు సహకరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. సంబంధిత అధికారి వివరణ అందాల్సి ఉంది. గతంలో స్థానికులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టినట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుపై విచారణ ఏ దశలో ఉంది? ఇళ్ల కేటాయింపుల రికార్డులను పరిశీలించారా? అర్హుల జాబితాలో అవకతవకలు గుర్తించారా? అక్రమ వసూళ్ల ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని బాధితులు కోరుతున్నారు.

**అర్హులకే ఇళ్లు కేటాయించాలి..**
**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

మన్సూరాబాద్ ఏరుకల నాంచారమ్మ నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు, ఎరుకల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హుల జాబితాను పారదర్శకంగా పరిశీలించాలని కోరుతున్నారు. అక్రమ వసూళ్లు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగినట్లు తేలితే తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఇళ్ల పథకం లక్ష్యం నిజమైన నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చడం. అలాంటి పథకంలో అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పేదల ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకతను నిర్ధారించి, అర్హులైన వారికి న్యాయం చేయడంతో పాటు అక్రమ వసూళ్ల ఆరోపణలపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై డిప్యూటీ కమిషనర్ పర్యటన



- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారాలు చూపించడమే లక్ష్యంగా చేపట్టిన "వన్ డే - వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి జన్వాడ, మిర్జాగూడ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఫిరంగి నాలాలో మురుగు నీటితో ఇబ్బందులు**

ఫిరంగి నాలాలో మురుగు నీరు ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. జన్వాడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని, నాలాల ఆక్రమణలను అరికట్టాలని ప్రజలు కోరారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా గ్రామంలోని శివాజీ చౌక్ వద్ద ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణకు సరిపడా సిబ్బందిని నియమించాలని కోరారు.

**ఆలయ భూములను కాపాడాలి**

గ్రామంలోని దేవాలయాలకు సంబంధించిన భూములను పరిరక్షించి, వాటిపై ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. ఇంద్రారెడ్డి నగర్, మిర్జాగూడ ప్రాంతాల్లోనూ డ్రైనేజీ, మంచినీరు, దోమల నివారణ, రహదారులు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

**సమస్యల పరిష్కారానికి**
**అధికారులకు ఆదేశాలు**

ప్రజలు తెలిపిన సమస్యలను డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఓపికగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాధాన్యత క్రమంలో పరిశీలిస్తామని తెలిపారు. సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మౌలిక వసతులు, పారిశుధ్యం, డ్రైనేజీ, మంచినీరు, రహదారులు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. "వన్ డే - వన్ వార్డ్" కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారాలు అందించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నార్సింగి సర్కిల్-45 కట్టుబడి ఉందని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ పర్యటనలో ఏఈ సంతోష్, వార్డు అధికారి ప్రభాకర్, పారిశుధ్య విభాగం ఇన్‌చార్జి లచ్చిరాం, జన్వాడ, మిర్జాగూడ గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## అస్తవ్యస్తంగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి
# డయాలసిస్ విభాగం






- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న డయాలసిస్ రోగులు
- పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం అంటూ రోగుల ఆవేదన

**పాల్వంచ విశాల భారతి:**

పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ విభాగం పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డయాలసిస్ విభాగానికి అనుబంధంగా ఉన్న మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో వాటిని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతూ క్రమం తప్పకుండా డయాలసిస్ చికిత్స పొందేందుకు ఆసుపత్రికి వస్తున్న రోగులకు కనీస పారిశుద్ధ్య సదుపాయాలు సక్రమంగా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన సిబ్బంది నిర్వహణ తీరుపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల వినియోగానికి ఉంచాల్సిన బకెట్లను శుభ్రపరిచే పనులకు ఉపయోగిస్తున్నారని, వాటిని శుభ్రం చేసిన తర్వాత కూడా సంబంధిత కర్రను బకెట్‌లోనే ఉంచుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల వల్ల మరుగుదొడ్లను ఉపయోగించుకోవడం ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొంటున్నారు. ఆసుపత్రి వంటి ప్రజారోగ్య కేంద్రంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, డయాలసిస్ విభాగంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డయాలసిస్ చికిత్స పొందే రోగులకు పరిశుభ్రమైన పరిసరాలు, శుభ్రమైన మరుగుదొడ్లు, సక్రమమైన పారిశుద్ధ్య నిర్వహణ ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అధికారులు తక్షణమే స్పందించి మరుగుదొడ్లను శుభ్రపరచడంతో పాటు, శుభ్రత పనులకు ఉపయోగించే సామగ్రిని ప్రత్యేకంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. అలాగే మరుగుదొడ్లను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక సిబ్బందిని పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

# అమ్మ వారికీ ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్, విశాల భారతి :**



ఇందిరా నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 1లో దుర్గా మాత ఆలయంలో దేవి మాత దర్శనము చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా బిజెపి ప్రదాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఆలయ చైర్మెన్ సందీప్, నేతలు ప్రభు గుప్తా,నగారం శ్యామ్, సతీష్రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చెరగని సంతకం

- కురవి గడ్డపై గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ఓ ప్రభంజనం!
- ఆపదలో ఆపద్బాంధవుడు.. పేదలకు కొండంత అండ
- యువతకు నమ్మకమైన నాయకుడు
- కురవి మండలంలో ప్రత్యేకంగా వినిపిస్తున్న పేరు
- గార్లపాటి భరద్వాజ్ రెడ్డి

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**



కొందరు నాయకులు పదవులతో గుర్తింపు తెచ్చుకుంటారు.. మరికొందరు హోదాలతో హడావుడి చేస్తారు.. కానీ ఎలాంటి హోదాలు, ఆడంబరాలు లేకుండానే ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం మాత్రం అందరికీ సాధ్యం కాదు! ప్రజల మధ్య ఉంటూ.. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా మారుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ అభిమానాన్ని సంపాదించుకోవడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం. అలాంటి ప్రజా సంబంధాలు, ఆత్మీయత, సేవాభావంతో కురవి మండలంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న వ్యక్తిగా గార్లపాటి భరద్వాజ్ రెడ్డిని ఆయన అభిమానులు అభివర్ణిస్తున్నారు.

**ఒక్క పలకరింపుతో ఆత్మీయత..**
**ఒక్క అడుగుతో అనుబంధం!**

భగవంతుడు వస్తున్నాడంటే మొక్కుతారో.. ఆదరిస్తారో తెలియదు కానీ, తమ భరద్వాజ్ రెడ్డి వస్తున్నారంటే ఆత్మీయంగా పలకరించని కుటుంబమే లేదనేంతగా ప్రజలతో ఆయనకు అనుబంధం ఉందని అభిమానులు చెబుతున్నారు. ఆయన రాకను ఒక సాధారణ పరిచయంలా కాకుండా, తమలో ఒకరిగా భావించే వ్యక్తి రాకగా చూస్తారని పేర్కొంటున్నారు. ప్రజల మధ్య కలిసిపోయే స్వభావం, అందరినీ ఆప్యాయంగా పలకరించే తీరు, కష్టాల్లో ఉన్నవారి పరిస్థితిని తెలుసుకోవాలనే తపన ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని వివరిస్తున్నారు.

**పేదల ఇంటి గడపే ఆయనకు ప్రజాసేవకు వేదిక!**

పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వారి కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ.. పరిష్కారం కోసం తన వంతు కృషి చేసే వ్యక్తిగా గార్లపాటి భరద్వాజ్ రెడ్డిని అభిమానులు కొనియాడుతున్నారు. ప్రజల దగ్గరకు వెళ్లి వారి బాధలను వినడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం వంటి చర్యలే నాయకుడికి ప్రజలతో నిజమైన బంధాన్ని ఏర్పరుస్తాయని చెబుతున్నారు. పేదవాడి ఇంటి గడప తొక్కడం గొప్ప కాదు.. ఆ ఇంటి మనిషి కష్టాన్ని తనదిగా భావించడం గొప్ప! ఆపదలో ఉన్నవారిని పలకరించడం గొప్ప కాదు.. వారి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రయత్నించడం గొప్ప! ఆ గొప్పతనమే గార్లపాటి భరద్వాజ్ రెడ్డి పట్ల తమ అభిమానానికి కారణమని ఆయన అనుచరులు అంటున్నారు.

**యువతకు అండగా.. జనసామాన్యానికి ధైర్యంగా!**

యువతకు ఏ చిన్న సమస్య వచ్చినా, సామాన్య ప్రజలకు ఏ ఇబ్బంది ఎదురైనా స్పందించే తత్వం గార్లపాటి భరద్వాజ్ రెడ్డిలో ఉందని అభిమానులు చెబుతున్నారు. సమస్యను చిన్నదిగా చూడకుండా, దాని వెనుక ఉన్న వ్యక్తి బాధను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను అన్వేషించడం ఆయనలోని సేవా భావానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడం ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారని వివరిస్తున్నారు.

**ఆపదొస్తే గుర్తుకొచ్చే పేరు..**
**అండ కావాలంటే వినిపించే పేరు!**
**గార్లపాటి భరద్వాజ్ రెడ్డి**

ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ఎవరు గుర్తుకొస్తారన్నదే ఒక నాయకుడి పట్ల వారికి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుంది. ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయం అందించేందుకు ముందుండే వ్యక్తిగా గార్లపాటి భరద్వాజ్ రెడ్డికి అభిమానుల్లో ప్రత్యేక స్థానం ఉందని చెబుతున్నారు. అందుకే ఆయనను అభిమానంతో 'టైగర్ గార్లపాటి భరద్వాజ్ రెడ్డి' అని పిలుస్తుంటారు. ఆ పేరులో ఉన్నది కేవలం అభిమానం మాత్రమే కాదు.. కష్టకాలంలో తమ పక్కన నిలిచే వ్యక్తి ఉన్నాడనే ధైర్యమని అనుచరులు అభివర్ణిస్తున్నారు.

**వ్యక్తిత్వమే పరిచయం.. మంచితనమే గుర్తింపు!**

గుణవంతుడు.. విద్యావంతుడు.. మేధావి.. మంచి మనసున్న వ్యక్తి అంటూ గార్లపాటి భరద్వాజ్ రెడ్డిని ఆయన అభిమానులు ప్రశంసిస్తున్నారు. హోదా, స్థాయి, పరిచయాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మెలగడం, ఎదుటివారి మాట వినడం, ప్రజలతో సులభంగా కలిసిపోవడం ఆయన వ్యక్తిత్వంలోని ప్రత్యేకతలని పేర్కొంటున్నారు. మనిషిని గొప్పవాడిగా నిలబెట్టేది అతని చుట్టూ ఉండే జనసమూహం కాదని.. అతని కోసం మనస్ఫూర్తిగా నిలబడే మనుషుల అభిమానమని చెబుతున్నారు.

**ఆయనతో నడిచే వారికి పరిచయం మాత్రమే కాదు.. ఒక అనుభవం!**

ఒక వ్యక్తితో పరిచయం ఉండటం వేరు.. ఆ వ్యక్తి మంచితనాన్ని దగ్గరగా తెలుసుకోవడం వేరు! ప్రజలతో ఆయన ఎలా మెలుగుతారు? ఆపదలో ఉన్నవారికి ఎలా స్పందిస్తారు? పేదల పట్ల ఎలాంటి ఆత్మీయత చూపిస్తారు? యువత సమస్యలపై ఎంత బాధ్యతగా వ్యవహరిస్తారు? అన్నది దగ్గరగా చూసినప్పుడే ఒక వ్యక్తిత్వంలోని అసలైన విలువ తెలుస్తుందని ఆర్ల పార్టీ భరద్వాజ్ రెడ్డి అభిమానులు అంటున్నారు. ప్రజలతో మమేకమవుతూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండే వ్యక్తితో కలిసి నడవడం అంటే కేవలం ఒక పరిచయాన్ని పెంచుకోవడం కాదు.. మంచి మనసున్న మనిషి నుంచి మానవత్వపు విలువలను తెలుసుకోవడమని వారు అభిప్రాయపడుతున్నారు. అలాంటి వ్యక్తులతో పరిచయం, సాన్నిహిత్యం ఏర్పడటం అదృష్టంగా భావించే అభిమానులు కూడా ఉన్నారని చెబుతున్నారు.

**పదవులు శాశ్వతం కాదు..**
**ప్రజల ప్రేమ మాత్రం చిరస్థాయిగా నిలవాలి!**

నాయకుడి గొప్పతనం అతను కూర్చున్న కుర్చీలో ఉండదు.. ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానంలో ఉంటుంది. అతని వెంట ఎంతమంది నడుస్తున్నారన్నదానికంటే, అతను పిలిస్తే ఎంతమంది మనస్ఫూర్తిగా స్పందిస్తారన్నదే నిజమైన అభిమానానికి కొలమానం. ప్రజలతో ఆత్మీయ సంబంధాలు ఏర్పరచుకోవడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, సేవాభావంతో ముందుకు సాగడం ద్వారానే ఒక వ్యక్తి ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటాడని గార్లపాటి భరద్వాజ్ రెడ్డి అభిమానులు పేర్కొంటున్నారు. కురవి గడ్డపై గార్లపాటి భరద్వాజ్ రెడ్డి పేరు వినిపించినప్పుడు అభిమానంతో పలకరించే వారు ఉండొచ్చు.. ఆయనతో కలిసి నడుస్తూ తమ అనుబంధాన్ని గర్వంగా చెప్పుకునే వారు ఉండొచ్చు.. ఆయన సేవాభావాన్ని దగ్గరగా తెలుసుకోవాలనే ఆసక్తి చూపేవారు ఉండొచ్చు. అయితే, నిజమైన గొప్పతనం ఇతరులు ఆయనతో ఎందుకు లేరని బాధపడటంలో కాదు.. ఆయనతో ఉన్నవారు ఆయన వ్యక్తిత్వాన్ని చూసి గర్వపడటంలో ఉంది! ప్రజల మధ్య ఉండే నాయకుడు.. ఆపదలో అండగా నిలిచే ఆత్మీయుడు.. పేదల సమస్యలపై స్పందించే సేవాభావి.. యువతకు భరోసానిచ్చే వ్యక్తి.. అభిమానుల మాటల్లో ఇవే గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ప్రత్యేకతలు. పేరు సంపాదించడం ఒక ఎత్తు.. మనసులు గెలవడం మరో ఎత్తు! కురవి మండలంలో ప్రజలతో మమేకమవుతూ, అభిమానుల ప్రశంసలు అందుకుంటున్న గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ప్రయాణం ఇదే సందేశాన్ని ఇస్తోందని ఆయన శ్రేయోభిలాషులు చెబుతున్నారు.

# 20 వేల అప్పు కోసం యువకుడి దారుణ హత్య

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- బీరు తాగుదామని పిలిచి కత్తితో దాడి
- ఫ్యూచర్ సిటీ పోలీసుల దర్యాప్తుతో చిక్కిన నిందితులు.
- మీడియా సమావేశంలో షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ వెల్లడి

**విశాల భారతి, షాద్ నగర్:**




రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కొత్తూరు తిగాపూర్ గ్రామ శివారులో డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో లో జరిగిన హత్య కేసును కొత్తూరు పోలీసులు ఛేధించారు. మీడియా సమావేశంలో ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొత్తూరు ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బోడెక్ ప్రేమ్ కుమార్ (18) ఈ నెల 14వ తేదీన తిగాపూర్ గ్రామ శివారులోని డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో హత్యకు గురయ్యాడు.వెంచర్‌లో యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో కొత్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడి గొంతుపై,ఛాతి, వీపు తదితర శరీర భాగాలపై పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలను గుర్తించారు.గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా,పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా మహమ్మద్ ఇర్ఫాన్ (20),మహమ్మద్ సవాజుద్దీన్ (23) అనే ఇద్దరు నిందితుల పాత్ర వెలుగులోకి వచ్చింది. ఇర్ఫాన్ హైదరాబాద్‌లోని బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కాగా, సవాజుద్దీన్ రంగారెడ్డి జిల్లా మైలార్దేవ్‌పల్లి పరిధిలోని ఉద్దండపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు.ఈ నెల 14వ తేదీ ఉదయం ఇర్ఫాన్ మృతుడు ప్రేమ్ కుమార్‌కు ఫోన్ చేసి గతంలో ఇచ్చిన రూ.20 వేల అప్పు తిరిగి చెల్లించాలని కోరినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.తక్షణమే డబ్బులు చెల్లించలేనని మృతుడు చెప్పడంతో,కలిసి బీరు తాగుదామని ఇర్ఫాన్ అతడిని డ్రీమ్ మిడాస్ వెంచర్ వద్దకు పిలిచాడు.అనంతరం సవాజుద్దీన్‌కు ఫోన్ చేసి బీరు సీసాలు తీసుకురావాలని కోరాడు.దీంతో ఇర్ఫాన్ మృతుడితో కలిసి వెంచర్‌కు వెళ్లగా,సవాజుద్దీన్ అక్కడికి బీరు సీసాలతో చేరుకున్నాడు. ముగ్గురూ కలిసి బీరు తాగుతున్న సమయంలో అప్పు డబ్బుల విషయమై ఇర్ఫాన్, ప్రేమ్ కుమార్ మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో ఇర్ఫాన్ తన వద్ద ఉన్న కత్తితో ప్రేమ్ కుమార్ ఛాతి,వీపు తదితర భాగాలపై పలుమార్లు పొడిచినట్లు దర్యాప్తులో తేలింది.ఇర్ఫాన్ దాడి చేస్తున్న సమయంలో సవాజుద్దీన్ మృతుడిని గట్టిగా పట్టుకుని సహకరించినట్లు పోలీసులు గుర్తించారు.

# నా కల చెదిరిపోయింది

కర్ణాటక సంగీత విద్వాంసురాలు, దిగ్గజ గాయని ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితకథతో రూపొందిస్తున్న 'భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి' చిత్రం ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. రష్మిక మందన్న టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ చిత్రానికి 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే పదేళ్ల క్రితమే ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కాల్సి ఉంది. విద్యాబాలన్ ప్రధాన పాత్రలో రాజీవ్ మీనన్ దర్శకత్వంలో ఈ బయోపిక్ కోసం ప్రయత్నాలు జరిగాయి. కానీ న్యాయపరమైన వివాదాల కారణంగా ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఈ విషయం గురించి విద్యాబాలన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటించాలనే తన కల నెరవేరకపోవడం బాధగా ఉందని ఆమె పేర్కొన్నది. 'చిన్నతనంలో ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాడిన సుప్రభాతంతోనే ఇంట్లో రోజు మొదలయ్యేది. ఆమె జీవితం గురించి నాకు చాలా విషయాలు తెలుసు. రాజీవ్ మీనన్ అద్భుతమైన స్క్రిప్ట్ సిద్ధం చేశాడు. కానీ అనుకోకుండా సినిమా ఆగిపోయింది' అని విద్యాబాలన్ చెప్పింది. అయితే రెండేళ్ల క్రితం ఎం.ఎస్. సుబ్బులక్ష్మికి నివాళిగా ఆమె జయంతి రోజున ప్రత్యేకమైన ఫొటోషూట్‌తో ముందుకొచ్చింది విద్యాబాలన్. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్రకు పర్‌ఫెక్ట్ ఛాయిస్ అంటూ ఆమె ఫొటోషూట్‌పై ప్రశంసలు లభించాయి.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.